# భారతి

శ్రీ తెన్నేటి సూరి

## 1

గోడమీది గడియారం రెండు గంటలు కొట్టింది—

షెల్ఫులోనుంచి ఒక యెర్రట్టపుస్తకం బయటికి వచ్చింది; డబ్బాలోనుంచి ఒక సిగరెట్టు పైకి లేచింది. గది పొగతో అయోమయమై కావురు వేసిపోతోంది.

ఎర్రట్టపుస్తకం చెల్లాచెదరై బోర్ల బొక్కులుగా బల్లమీద పడ్డది; ఆరిపోయిన సిగరెట్టుపీక గదిమూలకు దూకింది.

మరొక పచ్చట్టపుస్తకం షెల్ఫులోనుంచి యివతలకు వచ్చింది; మరొక సిగరెట్టు డబ్బాలోనుంచి పైకి లేచింది. మరొక పర్యాయం గది పొగతో అయోమయమైపోయింది.

పచ్చట్టపుస్తకం గజిబిజై యెర్రట్టపుస్తకం ప్రక్కనే, బల్లమీద బోర్లబొక్కులుగా పడ్డది; రెండో సిగరెట్టు పీక గదిమూలకు దూకింది.

షెల్ఫులోనుంచి నీలిరంగుపుస్తకం బయటికి వచ్చింది; డబ్బాలో మూడో సిగరెట్టు ఖాళీ అయింది; గది మరోపర్యాయం కావురు వేసిపోయింది.

నీలిరంగు పుస్తకం గిరగిరా తిరుగుతూ బల్లమీద పడివున్న రెండు పుస్తకాలమీదా దూకింది; గదిమూలకు మూడవ సిగరెట్టు పీక దూకింది.

షెల్ఫులోనుంచి నాలుగో పుస్తకం — డబ్బాలోనుంచి నాలుగో సిగరెట్టూ ఖాళీ—

గోడమీది గడియారం నాలుగు కొట్టింది.

నాలుగోపుస్తకం బల్లమీద దూకింది—నాలుగో సిగరెట్టు పీకెగూడ మూలకు ఉరికింది.

అయిదోపుస్తకం అయిదో సిగరెట్—ఆరోపుస్తకం, ఆరో సిగరెట్—ఏడోపుస్తకం, ఏడోసిగరెట్—చకచకా బల్లమీదా, గోడమూలా, గుట్టలు పడిపోయినై.

షెల్ఫులో పుస్తకాలన్నీ చెల్లాచెదరై రెక్కలు విరిచి, బజార్లో గుట్టబోసిన కొజ్జా పిట్టల్లా బల్లమీదా—డబ్బాలో సిగరెట్లన్నీ దగ్ధకాష్ఠాలై గోడమూలా పోగులుబడ్డయ్.

గడియారం అయిదుకొట్టేసింది—

నిస్పృహగా నిట్టూర్పు విడిచి, డబ్బాలోవున్న చివరి సిగరెట్టు తీసుకుని అగ్గిపుల్ల వెలిగించాడు. నిప్పుల్లవెలుగులో సిగరెట్టు పొగతో కావురువేసిపోయిన ఆ ముఖం, చికాగ్గా చెరిగి గజిబిజై వున్న క్రాఫింగు జుట్టుతో బీభత్సంగా కనుపించుతోంది.

కుర్చీదగ్గిరనుంచి కదిలి కిటికీదగ్గిరికి పోయి నిల్చున్నాడు. కిటికీలోనుంచి బయటికి ఆకాశంవంక చూస్తున్నాడు.

గగనపథాన ఎక్కడా వెలుగురేఖ లేదు; నల్లటి మబ్బులు ఆవరించి, సిగరెట్టుపొగతో కావురువేసిన ముఖంలా, చింతాక్రాంతంగా వుంది.

కిటికీచువ్వలమీద సిగరెట్టు నలిపి విసుగ్గా బయటికి విసిరేశాడు. నెమ్మదిగా గదిలోనుంచి మధ్య హాల్లోకి వస్తున్నాడు.

"గాన మధువీచికల
కలహంసవై—విరతి
కన్ను మూయర సామి
కళవళింపగ నేల—
ఉయ్యాల, జంపాల
ఊతునా నాసామి ?
వెయ్యారు గీతికల
విరిసి పోదువురార!—
ముత్యాలశాలలో,
నా—ముగుద మానసములో,
విరజాజి దీపికలు
వెలిగించితిని రారా! ॥గా॥

పడమటింట్లో ఒక సమ్మోహన గీతం సెలయేరులా ఆవిర్భవించి, అమృతవాహినులై నలుముఖాలా వాతావరణమంతా వ్యాపించిపోతోంది. ఆ మధురమంజుల గీతారావంతో ఆ భవనం యావత్తూ ఉత్తేజితమౌతోంది.

అతనికి మాత్రం పాట వినిపించుతోందిగాని, మాధుర్యం చెవిసోకటం లేదు.

మధ్య హాల్లోకి వచ్చాడు; పడమటిల్లు జిలిబిలి సంగీతాల కోలాహలంతో స్వర్గసీమలా వుంది. తన నైరాశ్య విషాద ప్రవేశంతో ఆ ఆనందోత్సవాన్ని భగ్నం చెయ్యగూడదనుకున్నాడు.

పిల్లిలా, చప్పుడు గాకుండా అడుగులు వేసుకుంటూ, గోడ దగ్గిరికివచ్చి, వంకెకు వ్రేలాడుతున్న తుండుగుడ్డ తీసి బుజాన వేసు

* ఈ సంవత్సరము ప్రపంచ కథానికల పోటీకి పంపించిన తెనుగు కథ.

కున్నాడు. గోడమూలనున్న చెప్పులు కాళ్ళకు తగిలించుకుని బయటికి బయలు దేరాడు.

'ఇలా ఒకసారి, లోపలికివచ్చి వెడతారూ?'—పడమటింట్లోనుంచి ఒక తియ్యటి గొంతు పిలిచింది. అతను వెనక్కు తిరిగిచూచాడు.

'బయటికి వెళ్లబోతున్నారల్లే వుంది—కాఫీ తయారు చేశాను—తాగి వెళ్లండి'—

చెప్పులు గోడమూల వదిలేసి, పడమటింటివైపు నడిచాడు. ద్వారబంధానికి చేరబడి మండిగంమీద కూర్చున్నాడు.

ఆరోగ్యంతో మిసమిసలాడుతున్న అవయవాలతో ఒక స్త్రీమూర్తి, కుంపటిముందు కూర్చుని కాఫీ కలుపుతోంది. అతను గుమ్మంమీదికి వచ్చి కూర్చోగానే, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ముచ్చటగా, ఆ కబురూ ఈ కబురూ చెప్పటం ప్రారంభించింది:

"మీరు చూడకనే పోతిరి—ఎంత చక్కగావుంది!—"

"ఏవిఁటీ?"—

"బుజ్జాయి సంగతుండీ!—ఇదేవిఁటి? ప్రొద్దున మన ఎల్లావు యీనిన సంగతి మీకు తెలీనే తెలీదా యేవిఁటి?"

ఆ మాటవిని అతనికి నవ్వాలనిపించిందిగాని, నవ్వటం అలవాటు తప్పి చాలారోజులై వుండటంచేత, నవ్వలేకపోయాడు. కాఫీతాగి కప్పూ సాసరూ క్రిందపెడుతూ:

'భారతీ!'—

'ఏవిటి?' అన్నట్టు అతని ముఖంలోకి తెల్లబోయి చూసింది. అర్థంకాని విషాదచ్ఛాయలేవో అలుముకుని అతని ముఖం అయోమయంగా వుంది.

'ఈ జీవితం నీకు ఎలావుంది?'

'అదేం ప్రశ్న?—ఎలా వుండట మేవిటి?-హాయిగా వుంది-అసలెందుకు అలా అడిగారూ?'—

'ఎబ్బే—ఏవీఁలేదు — ఏదో వెర్రిమాటడిగాను—ఏఁమీ తోఁచక' అంటూ నీళ్లు నవిలి, లేచి బయటికి వెళ్లిపోయాడు.

## 2

పొలాన్నుంచి తోలుకొచ్చిన పశువులన్నిటినీ కట్టు గొయ్యలకు కట్టేసి మేతలు వేసి, పాలేళ్లు యెవళ్లిళ్లోవాను వాళ్లు యిళ్లకు వెళ్ళిపోయారు. పాలు పితుక్కునే పని పూర్తి అయాక క్రొత్తగా పుట్టిన లేగదూడకు తల్లి పొదుగుదగ్గిర పాలుకుడవటం నేరుపుతూ భారతి గొడ్లదొడ్లోనే వుంది.

వెంకయ్యబాబు పొలాన్నుంచి వచ్చీ రావటమే మామూలు ప్రకారం సరాసరి గొడ్లదొడ్లోకి వచ్చాడు. ఆయన దొడ్లోకి రావటం గమనించి దొడ్లోవున్న గొడ్లన్నీ సంతోషంగా చెవులు రిక్కించి కళ్లు చారడేసిగా విచ్చులుకుని ఆయనవంక ఆప్యాయంగా చూస్తున్నయ్. క్రొత్తగా బుడ్డవేసిన గిత్తదూడ మోర పైకెత్తి 'అంభా' అంటూ జాలిగా అరిచింది. 'ఆ ఏవిటీ? అని విసుక్కుంటూ వెంకయ్యబాబు సరాసరి దానిదగ్గరకొచ్చి వెన్ను నిమిరాడు. బుసకొట్టి గాట్లోకి చూపిస్తూ మళ్లా 'అంభా' అన్నది. గాట్లోకి తొంగిచూచాడు. అసలే ఎందుకో చిరాగ్గావున్న మనిషికి అదిచూసి కళ్లు మరింత చింతనిప్పు లయాయి. పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ పాకలోకి వెళ్ళి వెలిగమీదనుంచి ఒక జనపకట్ట తీసుకొచ్చి విచ్చదీసి గాట్లో వేస్తూ:

'తగని మైమరుపు వెధవలకు—నోరులేని సన్నాసులని కనికరమైనా లేదు' అని పాలేళ్ళమీద విసుక్కున్నాడు.

'అసి భడవాముండా!' అని ఆశ్చర్యపోయింది భారతి. 'అది గాదు మావఁయ్యా! చిన్నిగాడు దానికి జనపకట్ట వేసే వెళ్లాడు. పరాకులేకుండా వూదుకుతిని, మారాంచేస్తే మళ్లా వేస్తారుగదా అని మీరు లోపలికి రావటంచూసి అలా వగలుబోతోంది—మీ చనువు చూసుకుని అది అలా ఆడుతోంది.'

'దాని ఒక్కదాని మాటే యేవిఁటి?—నా చనువు చూసుకునేకదూ యీ యింటో ప్రతిఒక్కరూ ఇలా భాగోతాలాడటం—నా గారాబాలవల్లనే యీ యిల్లు యిట్టా ముక్కచెక్కలై పోతోందని నువ్వు సూటిపోటిగా నన్ను ఎత్తి పొడవక్కర్లేదు. తలకు తాకి బొప్పె కడుతున్నా యింకా తెలుసుకోకుండా యేడుస్తావా?' అంటూ ఎక్కడలేని కోపమూ ముంచుకొచ్చేసి చివాల్న గొడ్లదొడ్డి తలుపు తెరుచుకుని యింట్లోకి వెళ్ళిపోయాడు.

మావఁగారు అన్నముక్కల్లో యే ఒక్కటీ భారతికి బోధపడలేదు. చిరునవ్వు నవ్వంది మాట్లాడే అలవాటు లేని ఆ వృద్ధుడు ఆనాడు అంత కోపంగా యెందుకున్నాడో అర్థంకాలేదు. లేగదూడను తీసుకొచ్చి పందిరిగుంజకు కట్టి తానుకూడా లోపలకు వెళ్ళింది.

పొలంనుంచి రాగానే వెంటనే వేడినీళ్లు పోసుకుని భోజనానికి కూర్చోవటం మావఁగారికి అలవాటు. వంకెనున్న తుండుగుడ్డా, కొల్లాయీ తీసుకువచ్చి ఆయనకు అందించింది. వాటిని భుజానవేసుకుని, స్నానం చెయ్యటానికి ఆయన దొడ్లోకి వెళ్లాడు; భారతి వంటయింట్లోకి వెళ్ళి మడిగట్టుకుంది. పీటా, మంచినీళ్ళూ పెట్టి విభూతిపండు తీసుకొచ్చి పీటప్రక్కను వుంచింది. వడ్డన యేర్పాట్లన్నీ పూర్తిచేసేసి సిద్ధంగా కూర్చుంది.

ఆయన స్నానంచేసి వళ్ళు తుడుచుకోవటమే తడవుగా మడిగట్టుకుని పీటమీదవచ్చి కూర్చున్నాడు. ప్రశాంతత చిందులాడుతూవుండే ఆయన ముఖం కందగడ్డలా యెర్రబడి భీషణంగా వుంది. పలకరించటానికి కూడా భయంవేసి, కిక్కురుమనకుండా పిల్లిలా వడ్డన చేస్తోంది.

ముఖాన విభూతి రాచుకుని తలవంచుకుని భోజనం చేస్తున్నాడు. స్తిమితంగా కూర్చుని కడుపునిండా భోజనంచేసే అలవాటున్న ఆ వ్యక్తి ఆనాడు అన్నం సహించనివాడులా మెతుకులు కొరుకుతూ, ఇటూ అటూ ముద్దలు తోసేస్తున్నాడు. భోజనం

సగపడబడ్డది. చివాల్న తల పైకెత్తి, కళ్ళవెంట చింతనిప్పులు రాలుస్తూ;

'తమ భర్తగారు యివాళ మళ్లా పట్నం వెంచేసేరా యేం.' అన్నాడు.

'లేదే'—

'లేకపోవట మేవిటి?—ఎందాకా మూసి పెట్టుకుంటావ్ ?'

'ఆయన అంతర మేవిటి? నా అంతర మేవిటి—ఆయన్ను నేను మూసి పెట్టడం యేమిటండీ—నా ముఖం.'

'మూసి పెట్టు మూసి పెట్టు—వాడి విషయం నీకే అంత నెప్పి లేనప్పుడు కాటికి కాళ్లుచాచుకున్నవాడికి నాకెందుకు యీ మనస్తాపమంతా?—ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. ఇంతకీ, పాతకాలపు వెర్రిబాగులవాణ్ణి నాకళ్లల్లో దుమ్ముగొట్టి తిరుగుతున్నాడు సరే—సర్వం తెలిసిన పసుచుదానివి నీ నెత్తిన కూడా చెయ్యిబెట్టి యిష్టంవచ్చినట్టు ఆడుతున్నాడు, అదీ విచిత్రం. నువ్వుకూడా నోట్లో నాలుకలేని యిలాంటి గంగిగోవువు కావటం నిజంగా నా దురదృష్టం'

'అర్థంకావటంలేదు మావయ్యా! ఆయన సంగతేవిటి ఇంతకీ?—'

'ఓహో! ఊరంతా కోడై కూస్తున్నా నీకింకా తెలీలేదన్న మాట! తెలీక కాదులే, కొడుకు ప్రతాపం తండ్రి నోటివెంట విని ఆనందించాలని అనుకుంటున్నావల్లే వుంది—సరే విను—నా కుమారరత్నం పట్నంలో ఒక అమ్మవార్ని బెట్టుకుని వెలుగుతున్నాడు—తెలిసినట్టైనా యిప్పటికేనా?'—

'అబ్బెబ్బే!—ఇవి ఎవరో గిట్టనివాళ్లు కల్పిస్తున్న మాటలు—ఆయన అలాంటి మనిషి కారు'—

'ఛట్! నోర్ముయ్యి!—ఏడిచినట్టుంది నీ కాపరం—ఇక ఆట్టే మాట్లాడకు—నీ తెలివితక్కువతనం చూస్తే నాకు అసహ్యం కూడా వేస్తోంది'—కలుపుకున్న పెరుగుముద్ద ప్రక్కకు త్రోసేసి లేచిపోయి చెయ్యి కడుక్కున్నాడు. మడి పంచె విప్పుతూనే, వీధి వాకిలి అరుగుమీదకు పోయి కూర్చున్నాడు.

## 3

విశాలమైన నదీగర్భం; వర్షఋతువులో ఊళ్ళూ నాళ్ళూ ముంచేత్తే ఆ మహానది చిక్కిశల్యమై, నదిగర్భానికి మధ్యగా సన్నని ఒక పాయలో మాత్రం, సిలమండల లోతున జాలిగొలిపే స్థితిలో నెమ్మదిగా ప్రవహిస్తోంది. రాజారావు, నీటిఒడ్డునున్న యిసుకదిబ్బమీద తుండుగుడ్డ పరుచుకుని పడుకున్నాడు. ఆకాశం వంక చూస్తూ, గత చరిత్రనంతా నెమరుకు తెచ్చుకుని ఆలోచిస్తున్నాడు.

రాజారావు ఎం. ఏ., పూర్తిచేసుకుని యింటికి రాగానే వెంకయ్యబాబు కోడల్ని తీసితెచ్చుకున్నాడు. రాజారావు ఆయీ ఉద్యోగాలకోసం కొంత ప్రయత్నించాడు వెంకయ్యబాబు అధికార వర్గాలలో పలుకుబడి వున్నవాడు కాకపోవటంచేత, పెద్ద ఉద్యోగ మేమీ లభించలేదు. గుమస్తా ఉద్యోగంకోసం ఊళ్ళు చ్చుకు తిరగవలసిన గతేం వచ్చిందని, వెంకయ్యబాబు కొడుకు చేస్తున్న సన్నరకం ప్రయత్నాలే లేవీ పడనిచ్చాడు కాదు. అసలు ఆయన ఆంతర్యంలో వున్న విషయం వేరు. దశాబ్దిపైబడి, దీపం బెట్టే ఆడదిక్కు లేక ఆయిల్లు శ్మశానవాటికలా పడుంది. మళ్ళా ఆదేస్థితి సంభవించటం ఆయనకు సనేమీ యిష్టంలేదు.

కాపురానికి వచ్చీ రావటమే భారతి గృహానికి సంబంధించిన యావత్తు బాధ్యతలనూ నెత్తిన వేసుకుంది. ఆవుల్ని పాలు దీయటం దగ్గరనుంచీ స్వయంగా చేసుకునేది. 'అంతమంది పాలేళ్లు వుండగా ఆ శ్రమంతా యెందుకు' అని మావఁగారు మందలించితే, పాడి గొడ్లనీ, వంటింటినీ పరాయివాళ్ళకు వప్పగించితే ఇక ఆయిల్లు కోలుకోదని సమాధానం చెప్పేది; నిరంతరం యేదో పాటా పద్యం పాడుకుంటూ, యేదో ఒకపని చేసుకుంటూ, ఆనందంగా వుంటోంది.

రాజారావు పరిస్థితిమాత్రం కేవలం ఇందుకు భిన్నంగా వుంది. ఆవూళ్లో అతనితో మాట్లాడేవ్యక్తి యే ఒక్కడూ లేడు. అతన్ని యించుమించు యేదో పరాయిజాతివ్యక్తిలాగా పరిగణించుకున్నారే తప్ప ఆప్యాయంగా యే ఒక్కరూ పలకరించరు. పోనీ వాళ్ళు పలకరించకపోయినా, తనే చొరవచేసి పలకరించుదామనుకున్నా, వాళ్ళతో మాట్లాడటానికి యే ముక్కా అతనికి తోచేది గాదు. ఒకొక్క క్షణం గడపటం ఒకొక్క మహాయుగంగా వుండేది. చేతికందిన పిచ్చి పుస్తకమల్లా చదువుతూ వుండేవాడు. చదవగా చదవగా అతనికి అన్ని పుస్తకాలూ ఒకే రకమైన ఊకదంపు క్షోభగా తోచటం మొదలెట్టింది. గత్యంతరం లేక చదివిన పుస్తకమే మళ్లా చదువుతే చికాకు బయలుదేరింది. రోజులు గడచినకొద్దీ అతనిలో ఏదో అర్థంకాని అనంతమైన చికాకు బయలుదేరింది. తనమీద తనకే కోపంగానూ, చిరాకుగానూ వుండేది. ఇంట్లోకీ బయటికీ కాళ్ళు బలపాలు కట్టేలాగు ప్రొద్దస్తమానం తిరుగుతూ వుండేవాడు. చుట్టూవున్న ప్రపంచం యావత్తూ నిర్జీవమైన శూన్యంగా తోచేది.

క్రమేపీ ఈ మానసికపరిస్థితి శారీరకమైనదౌర్బల్యంగా మారింది. తనలోవున్న జీవశక్తులన్నీ కర్పూరంలా హరించిపోతున్నట్టు రోజురోజుకూ దిగజారిపోవటం మొదలుబెట్టాడు. తలనొప్పి, అజీర్తి, పసరు పెరగటం, మలబద్ధకం, కాళ్ళునములటం ఈ రకమైన బాధలెన్నో పెరిగినై. తన శరీరంలో యేదో జబ్బ ప్రారంభమై వుంటుందని అనుమానపడ్డాడు. డాక్టరుతో సంప్రదించితే ఆయన గంటలతరబడి పరీక్షచేసి, 'మరేమీ జబ్బులేదు, అంతగా కాకపోతే, ఒకసారి ఆముదం తీసుకోమని సలహా యిచ్చాడు. ఒకసారికాదు పదిసార్లు తీసుకున్నాడు. కాని వ్యాధి స్వరూపంలో మార్పేమీ కనుపించలేదు. అసలు ఆ వ్యాధి మానసికమైనదో, శారీరకమైనదో అతనికి అర్థం కాలేదు. అతని స్థితిగతులు గమనించి భారతి యెందుకలా వున్నారని యెప్పుడేనా అడిగితే, ఏమి చెప్పటానికి తోచక 'యెలావున్నాను బాగానే వున్నాగా' అంటూ వుండేవాడు. అసలు, యిదమిద్ధమని బాధ యేమిటో తనకోటి తెలిస్తేగదా, ఇతరులకు చెప్పటానికి?

ఇలా వుండగా ఒకరోజున, తండ్రి యేదో పనిమీద, పట్నం వెళ్ళిరమ్మని పంపాడు. రైలెక్కి పట్నం వెళ్లాడు. టికెట్ కలెక్టరుకు టికెట్టిచ్చి గేటులోనుంచి బయటికి వస్తున్నాడు. ఇంతలోనే—'ఒరే! భయ్యా! రాజూ' అని ఒక గావుకేక వినిపించింది. చిరపరిచితమైన గొంతులా వినిపించటంచేత తల పైకెత్తి పారజూచాడు. స్టేషన్‌లో వున్న పుస్తకాలషాపుదగ్గిర నుంచుని, పంతులు, చప్పట్లుగొట్టి బొబ్బలు పెడుతున్నాడు. రాజు అటువైపు నడిచాడు. సమీపానికి రాగానే, పంతులు కరచాలనంచేసి, 'పెళ్లికి రమ్మంటే రాకపోయావే, నస్మరంతివి; ఇదిగో అస్మద్భార్యా రత్నం చూశావా?'—అని ప్రక్కన నిల్చునున్న స్థూలకాయంగల ఒక స్త్రీని చూపించాడు. ఒళ్లంతా బయటికి కనుపించుతూ యెర్రవాయిలు చీరే, పెదవులకు దట్టంగా పట్టించిన ఘోరరంగూ, ముఖంనిండా చెమటకు తడిసిన పౌడరు మకిలీ అదో వ్యాలకం మనిషిలా వుంది. పంతుల వెకిలిసంభాషణకు ఆవిడ నొచ్చుకోలేదు సరికదా ఉల్లాసపడుతున్నట్టు కూడా కనుపించింది. పంతులు ధోరణిగా చెప్పుకుపోతున్నాడు:

'మాజీ జిల్లాసిరస్తాదారు లేటు అభిరామయ్యగారి ఏకైక సంతానం—అంటే ఆయన లంచాలుపట్టి ఆర్జించిపోసిన ధనరాసుల నన్నిటినీ కళాపోషణార్థం వ్యయం చేయవలసిన బాధ్యత యావత్తూ యిప్పుడు మన భుజస్కంధాలమీద యెక్కివున్నదీ అని దీనితాత్పర్యం. పదవోయి బద్దూ యీ శుభముహూర్తానే మన కళాకేంద్రాన్ని దర్శింతువుగాని'—

'ఈయన మీ చదువుకునే రోజుల్లోకూడా యిలాగే మాట్లాడుతూవుండేవాడా అండీ?' అన్నదావిడ ముసిముసినవ్వులు నవ్వుకుంటూ.

'కొత్తగా మళ్ళీ నిన్నడగటం దేనికిరా సోదరా? ఈ వాచాలతి చూసికాదుట్రా ఈ శకుంతలానవలా తిలకం ఈ దుష్యంత మహారాజును వరించిందీ! లేకపోతే పాపరు వెధవకు మనకు మణికిరీటాదులు వగైరా ఎక్కడవుండేడిశాయి?

'పేరు శకుంతలాదేవి అనేనా? ఏలినవారి తాత్పర్యం?'

'మరేనోయి అజ్ఞానీ!—శ్రీమతి శకుంతలా ఎం. ఏ., సెక్రటరీ మహిళాసంఘం, ప్రెసిడెంట్ కళాకేంద్రం, సినీ అండ్ డ్రామెటిక్ క్రిటిక్, రచయిత్రి వగైరా ఇంకా అనేకం; యింటికి తగులడదాంపద, యివ్వవలసిన భోగట్టా యింకా దస్త్రాలతరబడి వుంది'—

'ఇప్పుడు కాదులే—కొంచెం తొందరపనిమీద వచ్చాను—కొన్ని సరుకులు కొని వెంటనే గ్రామానికి వెళ్ళిపోవాలి: మరొక పర్యాయం వస్తాను'—

'కుదరదు పదవోయ్ రోగ్!' అని భుజంమీద చెయ్యి వేశాడు.

'ఫరవాలేదులెండి; నౌకరుచేత సరుకులు తెప్పించి గ్రామానికి పంపుదాం—మీరు వచ్చి తీరాలిసిందే—ఇంతమంది మిత్రుల పరిచయం కలిగిందిగాని మిమ్మల్ని కలుసుకోవడం పడనేలేదు.—ఈయన మీసంగతి తరుచు చెబుతూ వుంటారు' అని ఆవిడకూడా వత్తిడి చేసింది.

'అమ్మో వీడా! వీడు రాజారావనే గొప్పమేధావి. రాధాకృష్ణన్ కంటే చాలా గొప్ప వేదాంతి; ప్రపంచచరిత్రవ్రాసి ప్రధానమంత్రి కాదలిచిని రాజకీయ దురంధరుడు — ఆంధ్రా నెహ్రూ, హెరాల్డ్ లాయిడ్, లాయడ్ జార్జి, జార్జి నైకొంట్ డడ్లీ, ఇడ్లీ అయ్యంగార్, ఐన్‌స్టీన్, స్టీన్‌బెక్ వగైరా—'ది గ్రేట్ బుక్ వరమ్ ఆఫ్ ఇంటర్ నేషనల్ లిటరేచర్'—అనగా—అంతర్జాతీయ సారస్వత సర్వస్వభక్షకైకదక్షు పిపీలికాగ్రేసరుడు—ఇక పదండి పోదాం! అంటూ పడదోసుకుపోయాడు. తప్పనిసరిగా, రాజు, ఆనాడు కళాకేంద్రాన్ని దర్శించవలసి వచ్చింది.

ఆ యిల్లు ఒక పెద్ద దివాణంలా వుంది. వచ్చేవారు వస్తుంటే వెళ్ళేవారు వెడుతూవుంటారు. అనేక రకాల కళాకారులు అక్కడికి చేరి చిత్రవిచిత్రాలైన విషయాలెన్నో మాటాడుతూ వుంటారు. ఉపన్యాసాలమీద ఉపన్యాసాలు హోరెత్తి పోతున్నయ్. కాఫీ త్రాగేవాళ్లకు కాఫీ, టీ త్రాగేవాళ్లకు టీ నౌకర్లు విధీ విరామం లేకుండా అందించుతున్నారు. సిగరెట్టు డబ్బాలు అసంఖ్యాకంగా బల్లలమీదపడి దొర్లుతున్నయ్. వాళ్లంతా యెంతో ఉల్లాసంగా వున్నట్టు రాజుకు తోచింది. వాళ్లంతా అంత సంతోషంగా ఎలా వుండగలుగుతున్నారో రాజుకు అర్థంకాలేదు. వాళ్లని గనుక సరిగా అర్థం చేసుకోగలిగితే తన మానసికవ్యాధికి, తగిన చికిత్స యేదైనా లభ్యం కావచ్చునని ఆశించాడు. అవకాశం వున్నప్పుడల్లా అక్కడికి వస్తూ పోతూ వుండటానికి నిశ్చయించుకున్నాడు. అందుకోసం ఆనాడే ఒక క్రొత్తసైకిలు కూడా కొనేశాడు.

* * * *

ఆ సమాజంతో పరిచయం యేర్పడినకొద్దీ రాజుకు మొదట్లో యేర్పడిన విభ్రాంతులన్నీ మబ్బుతెరల్లా విడిపోవటం మొదలు పెట్టెనై. వాళ్ళల్లో ప్రతి ఒక్కడికీ కూడా తను యేజబ్బుతో బాధపడుతున్నాడో అదే జబ్బు వున్నట్టు అవగతం చేసుకున్నాడు. తను ఒంటరిగా గ్రామంలో వుంటూ వుండటంచేత, పరులతో మాటాడే సావకాశంలేక చదివిన పుస్తకమే చదువుతూ తన్నుతాను 'బోర్' చేసుకుంటున్నాడు. వీళ్లు నలుగురూ యిక్కడ ఒకళ్లతో ఒకళ్లు కలుసుకునే సావకాశం వుంది గనుక వాగిన వాగుడే దినదినం ఊకదంపుగా వాగుతూ ఒకళ్ళనొకళ్లు బోర్ చేసుకుంటున్నారు; అంతే తేడా. అందులో ప్రతిఒక్కడు తను మాట్లాడుతున్న దేవిటో తనకే అంతుబట్టకుండా మాట్లాడుతూ వుంటాడు. అందరికీ ఒకే రకమైన దీర్ఘరోగం (క్రానిక్ డిసీజ్)—చెప్పిన పాత సంగతే దినదినం చెబుతూవుండటం; పాడిన పాతపాటే దినదినం పాడుతూవుండటం; తమ్ముతాము బోర్ చేసుకుని యితరులను బోర్ చెయ్యటం.

తను యే వ్యాధితో బాధపడుతున్నాడో అక్కడికి చేరే ప్రతిఒక్కడూ అదే వ్యాధితో తీసుకుంటున్నట్టు, రాజుకు స్పష్టమైపోయింది. ఆ వ్యాధియొక్క స్వరూప స్వభావాలను సంపూ

ణ్ణంగా అవగతం చేసుకోవాలని అతనికి పట్టుదల కలిగింది. అక్కడికి చేరే వ్యక్తులనే గాక తనకు తారసిల్లే ప్రతివ్యక్తినీ అదే దృష్టితో పరిశీలించటం మొదలుపెట్టాడు. దేశంలో వున్న జనాభాలో, సగటున, నూటికి తొంభైమందిలో ఆ వ్యాధి చిహ్నాలు అతనికి గోచరమైనై. ఆవేశంతో ఈ పరిశోధన కార్యక్రమానికి పూనుకున్న నాటి నుంచి అతనిలో ఏదో కొంత నూత్న చైతన్యం పొటమరించటం ప్రారంభించింది. క్రమేపీ ఆరోగ్యంకూడా చక్కబడుతున్నట్టు తోచింది.

*

మామూలు ప్రకారం ఒకనాటి సాయంత్రం అతను కళాకేంద్రానికి వచ్చాడు. మధ్య హాల్లో యెవ్వరూ కనుపించలేదు. వరండా మెట్లుదిగి పెరటితోటలోకి అడుగుపెట్టాడు. తోటలో వున్న రాచవుసిరిచెట్టుక్రింద శకుంతలాదేవి, భావకవితల్లజుడు శశికుమార్ కనుపించారు. శశికుమార్ పద్యాలు చదివి వినిపించుతున్నాడు; శకుంతల, చేతిలోవున్న తాళం చెవుల గుత్తిని పూలబంతిలా పైకి ఎగరేసి పట్టుకుంటూ ఉల్లాసంగా వింటోంది.

శశికుమార్:—'అందుకోరాని గగన పర్యంకసీమ
ఆణిముత్తెపు చుక్కల రాణి వీవు!'—

శకుంతల:—సెబాస్! బాగా అన్నావు.

శశి:—'దుస్సహావిషాద పాతాళ దుఃఖవీధి
ప్రాకులాడెడు ఒక వానపాము నేను'—

శకుంతల:—ఛీ! వెధవా! పండంటి మగబిడ్డవని ఆశపడ్డాను; నువ్వూ పురుగువెధవ్వేనా?'—తన మనస్సులో కలిగిన జుగుప్సనంతా వెళ్ళగక్కుతూ చికాగ్గా కంటగించుకుంది.

వాడు తెల్లమొహం వేశాడు—

అందుకోలేనని తెలిసినవెధవ్వు మరి యెందుకీ రభసంతా?'

'చేతిలో కాని లేదు—పదో అయిదో పారేస్తావని'—

'ఆ యేడుపు ముందే యేడవకూడదూ—దీనికో ఏకాంతమూ, ఈ శృంగార కావ్యకలాలాపం ఈ చెత్తంతా దేనికి?'—

దూరాన రాజు కనుపించాడు.

'రావోయ్! రాజా—ఇలారా—ఇక్కడున్నాం' అని కేక పెట్టింది.

'ఏదో కావ్యగోష్ఠిలో వున్నట్టున్నారు'—

'మనవాడు చేతావాతా గాని శృంగారకాండ ఒకటి మొదలుపెట్టాడులే—కొంచెం వీడి గ్రంథం కనుక్కుంటున్నాను.'

'ముక్కుపచ్చలారని పసిబిడ్డ; వాణ్ణిబట్టుకు యెందుకు వేళాకోళాలాడతావు.'

'అరితేరిన దిగ్దంతివి నీవు దిగాలుగా రంగంలోకి—దా కూర్చో'—

రాజు, ఆ వ్యక్తి వొళ్ళు తెలియని రసపిచ్చలో వుందని గ్రహించాడు. ప్రసంగం పెంచితే రసాభాసంగా తయారవుతుందని తటాయించుకున్నాడు.

'ఇక్కడే కూర్చోండి లోపలికి పోయి యిప్పుడే క్షణంలో తిరిగొస్తాను' అని వాళ్ళిద్దర్నీ చెట్టుక్రింద వదిలేసి చకచకా లోపలికి వెళ్ళిపోయింది.

రాజు: కుమార్ ఆ పద్యం యెందుకు వ్రాసినట్టూ!

శశి: కావ్యం యెందుకు వ్రాశావంటే యేవిటి చెప్పటం.

రాజు: వ్రాస్తే వ్రాశావనుకో, దాన్ని అలా తెగపొగిడావు దేనికి?

శశి: పదిరూపాయలు పారేస్తుందేమోనని.

రాజు: ఇంతేనా?

శశి: లేకపోతే ఆ తాటకిమీద నాకు ప్రణయమనుకున్నావా!

రాజు: అమాయకుడివి, దానిసంగతి నీకు తిన్నగా అర్థం కావడంలేదు—జాగ్రత్తగా మెసులు.

శకుంతల వరండాలోకి వచ్చి, "శశీ!" అని కేక పెట్టింది. శశి లేచి దగ్గిరికి వెళ్ళాడు. అతని చేతిలో ఒక పదిరూపాయలు పారేసింది. అతను ఆ దారిన అటే బయటికి వెళ్ళిపోయాడు. శకుంతల వరండా మెట్లు దిగి, గేటు తీసుకొని కారు గారేజ్ లోకి వెళ్ళింది.

రెండుక్షణాల్లో గారేజిలోనుంచి బయలుదేరి, కారువచ్చి భవనంముందు ఆగింది. 'రాజా!' అంటూ శకుంతల కారులోనుంచి కేక పెట్టింది. రాజు ఉసిరికచెట్టు క్రిందినుంచి లేచి కారుదగ్గిరికి వెళ్లాడు. శకుంతల డ్రైవరు సీటులో కూర్చునుంది.

'ఎక్కు కార్లోకి.'

'ఎందాకా?'

'చెబుతా ఎక్కు.'

'నాకు కొంచెం పనుందే!'

'ఏమ్లేదు ఎక్కు—మనకు పనేవిటి?'

'ఎక్కడికో చెప్పరాదూ'

'ఎక్కడి కేవిటి? సినిమాకని తెలీడం లేదూ—తోచక చస్తుంటే.'

'సినిమా చూస్తే తోస్తుందా?'

'రాతిముఖం పెట్టుకు తర్కం మాట్లాడకు—నాకు వళ్ళు మండుతుంది'—

'అవును మెదడును ఉపయోగించి ఆలోచించితే మనం అసలు బ్రతకలేము—సరే చద్దాంపద'—పోయి వెనకసీట్లో కూర్చోబోయాడు.

అలా వెనకసీటులో తగలడబోతున్నావేం—ఇంతలో నే మింగెయ్యనులే—ఇలా ముందుసీటులోకి అఘోరించు'

'మింగెయ్యకపోయినా ప్రక్కసీట్లో కూర్చుని బాతాఖానీ వేస్తే కారు యే వంతెనకో వేసికొట్టి నన్ను హత్యచేసి నువ్వూ ఆత్మహత్య చేసుకుంటావ్'—

'మీ మగముండాకొడుకుల్ని చూస్తే నాకు అదేమంట—ఆడదంటే అంత హడిలి చస్తారేం—ముందు లేచి, వొస్తావంటావా రావా?'—

దిగివెళ్లి ముందుసీటులో కూర్చున్నాడు. కారు రోడ్డువెంట కలుపుతెంచుకున్న బర్రెగొడ్డులా ఎగబడిపోతోంది. జనం తప్పు కుంటున్నారు.

శకుంతల : పంతులు యింటికొచ్చి మూడురోజులైంది.

రాజు : క్లబ్బులో మూడురోజులనుంచి అహోరాత్రులూ పేకాట సాగుతోంది.

శకుంతల : ఈమధ్య తాగుడుకూడా అలవాటైంది.

రాజు : నువ్వూ తాగుతున్నావ్.

శకుంతల : రాజూ!

రాజు : బుకాయిస్తా వెందుకు?—తాగితేగాని బ్రతకలేని స్థితికి వచ్చావ్; ముందు ముందు, తాగి బ్రతకలేని స్థితి యేర్పడి ఆత్మహత్య చేసుకుంటావ్—నీ వ్యాధికి అది సరియైన మందు కాదు.

కారు సినిమాహాలు గేటుముందు ఆగింది; ఇద్దరూ దిగి లోపలికి వెళ్లారు. మొదటితరగతి టికెట్లుకొని బాల్కనీమీదికి పోయి కూర్చున్నారు.

లైట్లు వెలుగుతున్నయ్; ఫాన్లు తిరుగుతున్నయ్; రాజు జనాన్ని పరిశీలించుతున్నాడు. శకుంతల అనవసరమైనస్థాయికి గొంతు పెంచి, రాజుతో ఆ పిచ్చిమాటా యీ పిచ్చిమాటా, హాలంతా వినిపించేటట్టు బిగ్గిరిబిగ్గిరిగా చెబుతోంది. మధ్యమధ్య పగలబడి నవ్వుతోంది. హాల్లోవున్న జనమంతా లేచి నిల్చుని ఆ యిద్దరివంకా విడ్డూరంగా చూస్తున్నారు. రాజుకు చిరాకు పుట్టుకొస్తోంది.

లైట్లు ఆరిపోయాయి, సినిమా ప్రారంభమైంది. శకుంతల 'రన్నింగ్ కామెంట్రీ' మొదలు పెట్టింది. మధ్యమధ్య పెద్దపెట్టున నవ్వుతోంది. హాల్లో జనం సినిమా చూడ్డం మానేసి వాళ్ళవంకే చూస్తున్నారు. రాజుకు అంతకంతకు వళ్లు మండుకుపోతోంది.

హాలుమానేజరు వచ్చి 'దయవుంచి కొంచెం నెమ్మదిగా మాట్లాడుకోండి' అని మర్యాదగా మందలించి వెళ్ళాడు. శకుంతల అతనిమాట వినిపించుకోలేదు.

శకుంతల:—వెధవబోరింగ్ — ఈ సినిమాతీసిన చెత్త వెధవెవడో—

రాజు:—బాగుండకపోతే, యింటికి పోదాంపదరాదూ?

శకుం:—ఇప్పట్నుంచీ యింటికిపోయి చావమన్నావా?—తోచి యేడవకనే కాదూ ఇక్కడికి అఘోరించిందీ?

రాజు :—మరింకేం మెదలకుండా కూర్చుని చూడు—ఫిలిం కూడా బాగుంది కూడా.

శకుం:—అవును; వాడు నీవంటి పతివ్రతలకోసమే ఈ ఫిలిం తీసినట్టున్నాడు (ఊపిరి సలపకుండా పగలబడి నవ్వేస్తోంది.)

'ఏమిటీ రభసంతా?'—

'నాకు బోరింగ్ గా వుంది'—

'ఏమంటావ్?'—

'మంచివాడివి అలా దారికిరా—నేను చెప్పినట్టు వింటే నవ్వటం మానేస్తాను—లేకపోతే ఆట ఆఖరయ్యేదాకా నీకర్మ యింతే!—

'ఏమిటామాట?—చెప్పరాదూ'—

'నాతో బీచికి వస్తానంటే యిద్దరంలేచి వెళ్లిపోదాం—లేకపోతే యిక, నీ యిష్టం.'

'ఇప్పుడు మళ్లా బీచికి దేనికి?'

'సరే యింకేం అనుభవించు'—

'సరే పోదాం పదా'—

ఇద్దరూ లేచి బయటికి వెళ్లిపోయారు. శకుంతలవచ్చి కారులో కూర్చుంది. అవమానంతో కందగడ్డయిన ముఖంతో అతనుకూడా వెళ్ళి ప్రక్కసీట్లో మౌనంగా కూర్చున్నాడు. కారు బయలుదేరింది.

'నా వంట్లో బాగుండటంలేదు రాజూ!'

'ఏమిటి జబ్బు?'—

'తెలీదు—అనుక్షణం యేదో ప్రాణం పోతున్నట్టుగా వుంటుంది.'

'అవును నాకూ అలానే వుంటుంది—ఏదైనా వాగుతూ వుంటే కొంచెం ఉపశాంతిగా వుంటుంది'—

'వేళాకోళంగాదు'—

'కాదు నిజమే చెబుతున్నాను—యిదేదో ఒకరకమైన జబ్బు; ఇది ఇంచుమించు మనవాళ్ళందరికీ వుంది. దేశంలో వున్న జనాభాలో ముప్పాతికమంది యిదే వ్యాధితో తీసుకుంటున్నారనుకుంటాను'

'నీకు ప్రతిదీ వేళాకోళం.'

'నిజం చెబితే నీకు వేళాకోళంగా వుంది. ఈ వ్యాధి విషయమై నేను డాక్టర్లనుకూడా సంప్రదించాను. వాళ్లకీ అంతు చిక్కలేదు.'

కారువచ్చి సముద్రపుటొడ్డున ఆగింది. ఇద్దరూ కారుదిగి యిసుకపఱ్ఱమీదుగా నడుస్తూ నీటి ఒడ్డుకు చేరుకుంటున్నారు. పిండి ఆరబోసినట్టు వెన్నెల; నిర్మానుష్యంగావుంది. నడుస్తూ నడుస్తున్న శకుంతల గిరుక్కున వెనక్కు తిరిగి అతనివంక చూసింది.

చేతులు రెండూ వెనక్కు కట్టుకుని ఒకొక్క అడుగే ధీమాగా ముందుకు వేస్తూ మౌనంగా నడుస్తున్నాడు. ఆ మౌన గంభీరమూర్తిలో స్ఫురించుతున్న ఆ మనఃస్థైర్యం శకుంతలను కలవరపరిచింది. ఆ మందరపర్వతాన్ని ఛిన్నాభిన్నంచేసి పారెయ్యాలనే వెఱ్ఱి ఆవేశమొకటి శకుంతల మనస్సులో ఆవిర్భవించింది. చివాల్న అతనికి అడ్డంవచ్చి నిల్చుంది. ముఖం ఆవేశంతో కందగడ్డయి, పెదవులూ బుగ్గలూ గజగజా వణకిపోతున్నయ్.

'రాజూ!'—

'ఊఁ...'

'కావిలించేసుకోనా?'

'ఎందుకూ?'

'నా మనసు బాగుల్లేదు'—

'నన్ను కావిలించుకున్నా నీమనసు బాగుండదు—పంతులు నిన్ను యెన్నిసార్లు కావిలించుకున్నాడు కాదు?'—

'వాడు వట్టి లుచ్ఛా!—వాడిమాట యెత్తకు—నేను ఆలంబనంలేని తీగలా, అల్లాడుతున్నాను' చేతులు రెండూ త్రాచుపాముల్లా అతని కంఠానికి పెనవెయ్యబోయింది. అతను చిరాగ్గా రెండుచేతులూ అందిపుచ్చుకుని వారించి:

'ఆగు ఒకమాట చెబుతాను; పంతులుమీద నీకంత చిరాకు కలగటానికి వాడుగాదు కారణం—నీ మనస్సే; రేపు తెల్లవారేసరికి నీకు నామీదకూడా చిరాకు పుడుతుంది. ఈ సంవత్సరంలో నీకు అనేకమందిమీద ఇలా చిరాకు కలిగింది—అవునా?'—

'రాజూ!'—

'కోప్పడకు—నిక్షేపంలాంటి భార్య యింట్లో వుండికూడా నేను ఎందుచేత సుఖంగా బ్రతకలేకపోతున్నానో, నిక్షేపంలాంటి భర్తవుండి నువ్వూ, నిక్షేపంలాంటి భార్యవుండి నీ భర్తాకూడా, అదే కారణంచేత, హాయిగా బ్రతకలేక పోతున్నారు.'

'నేరా... !— నేను చచ్చిపోతున్నాను — నీకు

... రాలేదు.

అమర్చిం

కూడా పక్కలు పరిచివచ్చింది. ఇంత ప్రొద్దుపోయినా యింకా యింటికి రాలేదేమా అని ఆందోళనగా ఎదురుతెన్నులు చూస్తోంది.

వెంకయ్యబాబు పక్కమీదవచ్చి పడుకున్నాడు. ఆయనకు నిద్రపట్టలేదు. లేచి పడిమంచంమీద కూర్చున్నాడు. చుట్టమీద చుట్ట వెలిగిస్తూ గిజాటుగా ఆలోచిస్తున్నాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

ముంగిలి గడపలమీద చెప్పుల చప్పుడు వినిపించింది; భారతి ఆదుర్దాగా హాల్లోకివచ్చి తొంగిచూచింది. రాజారావు మెట్లెక్కుతున్నాడు—

'ఇంకా పడుకోకుండా అలానే కూర్చున్నారేం నాన్నా! నిద్రపట్టడం లేదా?' అని తండ్రిని పలకరించాడు.

'నిద్రా నిప్పులూ!—ఇంకా నా బ్రతుక్కు నిద్రేవిటి?'— ముసలాయన మండిపడ్డాడు.

రాజారావు విభ్రాంతుడయ్యాడు; తండ్రికి అంత కోపం యెందుకొచ్చిందో అతనికి అర్థంకాలేదు. కిక్కురుమనకుండా హాల్లోకి వచ్చేశాడు. చెప్పులు విప్పుతూ, భార్యను దగ్గిరికి పిలిచి, రహస్యంగా: 'భారతీ!—నాన్న అలా కోపంగా వున్నా రెందుకు?' అని ఆదుర్దాగా అడిగాడు.

'మరేం లేదులెండి—పెద్దప్రాణం—ప్రొద్దస్తమానం పని చూసుకొచ్చి, ఏదో అలా కొంచెం విసుగ్గా వున్నట్టున్నారు.'

'మరేం లేదుగదా?'

'... చాలా ప్రొద్దుపోయింది—భోజనానికి ... కొంచెం పెందరాళే ఇం...

'వీధిలో పెంట పోగు బండీ—దొడ్లో పెద్దెడ్ల జతా ఆపడ్డం లేదండీ'—

'చిన్నదొర పెద్దెడ్ల జతను పూన్చమని పాటిమట్టి బండి పడమటి చేనుకు తోలుకెళ్లారు. నిన్న చిన్న జతను తోలుకెళ్లి తూర్పు చేలో నారుమడి దున్నమన్నారు. వచ్చి మధ్యాహ్నం చూసుకుంటారు.'

వీరాయి విస్తుపోయాడు—'చిన్నదొర పాటిమట్టిబండి తోలుకెళ్లడమేంటండీ!—సదువుకున్న మారాజు అరికేం కర్మ!'

'చదువుకున్నవాళ్లు సంసారం దిద్దుకోగూడదా యేవిట్రా?—పిచ్చివాగుడూ నువ్వూనూ—వెళ్లి నీపని నువ్వు చూసుకో' అని మందలించి, చకచకా లోపలికి వచ్చేస్తోంది.

'భారతీ!—

ఈలోగా నిద్రమెలుకూవచ్చి, మగత నిద్రలో యీ సంభాషణంతా చెవులబడ్డ వెంకయ్యబాబు చివాల్న పక్కలో లేచి కూర్చున్నాడు.

'ఏవిటి మావయ్యా!'—గిరుక్కున వెనక్కు తిరిగి మావగారి మంచానికి దగ్గిరసా వచ్చింది.

'భారతీ! మతి స్తిమితం లేని ముసలివాణ్ణి, తొందరపడి యేదో పిచ్చివాగుడు రెండుముక్కలు వాగానను కో—ఇంతలోకే యిలా బుద్ధి చెప్పెయ్యాలా?'

'అదేవిటి మావయ్యా అంతమాట అన్నారూ?—ఏవిటి అపచారం?'

'గడుసువారింటి ఆడబడుచువు—అపచారంలా కనుపించేట్టు చేస్తావా?—నా చేతిలో కర్రలాక్కుని యిప్పట్నుంచీ వాడికిచ్చేస్తే పనీపాటా, లేకుండా నేను బ్రతికేదెలా?'

'ఏభైయేళ్ళు పైబడి యింటిదగ్గిర కూర్చోవలసిన పెద్దలు, మీరే, పనిలేకుండా బ్రతకటం కష్టమని బెంగపడుతుంటే పాతికేళ్ల హుమ్మస్సులో వున్న పడుచువారి సంగతేవిటి?'

'మంచిపనే చేశావులే!'—

'ఇది చాలా చిత్రమైన దేశం—ముసలీ ముతకా పనులకోసం ప్రాభవాలకోసం ప్రాకులాడుతూ, పడుచువాళ్ళనూ, బలసంపన్నులనూ యిళ్ళల్లో కూలేసి, కుములబెట్టుకుంటూ వుంటారు'—

'అసి నీదేశమూ నువ్వూ బంగారంగాను!—ఇంత పక్షపాతమేవిటే? వాడిసంగతే ఆలోచిస్తావుగాని నాగతి ఆలోచించవేం? పోనీ నీ కడుపున ఒకకాయ గాసింది గనక మనవణ్ణి బుజానెత్తుకని తిరగమన్నావా?'—

భారతికి యెక్కడలేని సిగ్గూ ముంచుకొచ్చింది; సమాధానం చెప్పకుండా తలవంచుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

పడమటింట్లో నా...